క్లుప్తంగా

ఆటో డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

కొయ్యూరు: డౌనూరుకు చెందిన సిఫా సంస్థ, విశాఖకు చెందిన కన్సర్న్ చారిటబుల్ సంస్థలు సంయుక్తంగా మహిళలు, పురుషులకు నెల రోజుల పాటు ఆటో డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా సిఫా సంస్థ డైరెక్టర్ శశిప్రభ మాట్లాడుతూ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని డౌనూరులో సోమవారం ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అర్హులై, ఆసక్తిగల వారు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి కన్సర్న్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ పి.కె.జోస్, సిఫా కో–ఆర్డినేటర్ హరిప్రసాద్, సర్పంచ్ పాట్టి భవానీ తదితరులను ఆహ్వానించినట్టు నిర్వాహకులు తెలిపారు.

వరద బాధితులకు నిత్యావసర సరకులు



బాధితులకు కూరగాయలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చింతూరు: స్థానిక గురుకుల పాఠశాలలోని పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న వరద బాధితులకు ఆదివారం కూరగాయలు, పాలప్యాకెట్లు పంపిణీ చేశారు. వరదల కారణంగా ఇళ్లను ఖాళీ చేసిన బాధితులు గత ఐదు రోజులుగా ఇక్కడ నివాసముంటున్నారు. వీరికి ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన ఉల్లిపాయలు, దొండకాయలు, బంగాళాదుంప, పాల ప్యాకెట్లను అందించారు. మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ అక్బర్‌అలీ, తహశీల్దార్లు కారం సుబ్బారావు, కరక సత్యనారాయణ, వార్డు సభ్యుడు కారం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం

హుకుంపేట: మండలంలోని ఎడతెరిపి లేకుండా ఆదివారం వర్షం కురిసింది.పలు ప్రాంతాల ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లో నీరు భారీగా చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వరి తదితర పంటల సాగుకు సన్నద్ధమయ్యారు.

అనాథ శరణాలయానికి వితరణ



అనాథ శరణాలయానికి బియ్యం, నగదును అందజేస్తున్న దాతలు

సాక్షి,పాడేరు: పాత పాడేరు గ్రామానికి చెందిన సంతల వ్యాపారి మధుమతి రాము, పార్వతి దంపతులు తమ కుమారుడు భరత్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. గుడివాడలోని అనాథ శరణాలయంలోని బాలబాలికల సంక్షేమం నిమిత్తం రూ.10వేలు, 100కిలోల బియ్యాన్ని రాము దంపతులు శరణాలయం నిర్వాహకులకు అందజేశారు. దాతల సేవలను మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు, ప్రసాద కమిటీ అధ్యక్షుడు ఉప్పల వెంకటరత్నం తదితరులు అభినందించారు.

ప్రకృతి వనరుల మినీ కేంద్రం ప్రారంభం



నూతలగుంటపాలెంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనరుల మినీ కేంద్రం

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెంలో ప్రకృతి వ్యవసాయం సాగుకు అవసరమైన ఎరువులు, కషాయాలు రైతులకు అందుబాటులో ఉంచేందుకు ప్రకృతి వనరుల మినీ కేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్ లచ్చన్న ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో జీవామృతం, ఘన జీవామృతం, వివిధ కషాయాలు అందుబాటులో ఉంచనున్నట్టు ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి డి.రమణ తెలిపారు. రైతు భరోసా కేంద్రాలున్నచోట పెద్ద వనరుల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపుతారన్న ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చేపలు, బెల్లంతో మీనామృతం తయారీపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు.

జోరుగా వరి సాగు



రాజవొమ్మంగిలో వరి నాట్లు వేస్తున్న రైతులు

- పనుల్లో రైతులు నిమగ్నం
- ఆర్బీకేలకు చేరిన 567 టన్నుల ఎరువులు

రాజవొమ్మంగి: మన్యంలో ఖరీఫ్ వరిసాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే అదను దాటిపోయిందంటూ రైతులు రాత్రి పగలు తేడా లేకుండా దమ్ములు చేస్తు, నాట్లు వేసేందుకు సిద్ధ పడుతున్నారు. జూలై మొదటి వారానికే పూర్తి కావాల్సిన నాట్లు ఈ ఏడాది ఆగస్టు సమీపిస్తున్నా మూడింట ఒక వంతు కూడా పడలేదు. పంట సాగు కోసం సకాలంలోనే ప్రభుత్వ రైతు భరోసా సొమ్మును రైతులకు అందజేసింది. దీంతో సీజన్‌కు ముందుగానే ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు సరఫరా పూర్తిచేసింది. అయితే ఎగతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నాట్లు ఆలస్యం అయ్యేందుకు కారణమైనట్టు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా ట్రాక్టర్లతో పొలాలను దమ్ము చేసే పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. రెండు సార్లు దుక్కుదున్ని (దమ్ము చేసి) పొలంలో పిచ్చి మొక్కలు, గడ్డి బాగా కుళ్లే వరకు నాలుగు రోజులు ఉంచుతారు. ఆ తరువాత తిరిగి పంట దమ్ము చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఇప్పుడిప్పుడే పూర్తి కావస్తుండటంతో అక్కడక్కడా నాట్లు వేసే పనులు మొదలయ్యాయి. ఏ గ్రామంలో చూసినా రైతాంగం ఇంటిల్లిపాది ఖరీఫ్ పనుల నేపథ్యంలో పొలాల్లోనే ఉంటున్నారు.



మార్క్‌ఫెడ్ డీఎం కె.రమేష్

ఆర్బీకేలకు ఎరువులు

రైతుల అవసరాల మేరకు రైతు భరోసా కేంద్రాలలో ప్రభుత్వం ఇప్పటి నుంచే ఎరువులను సిద్ధంగా ఉంచింది. అడ్డతీగల సబ్ డివిజన్‌కు చెంది సుమారు 6వేల హెక్టార్లలో వరి సాగవుతుండగా ఇప్పటికే 142.75 టన్నుల ఎరువులు ఆర్బీకేలకు చేరినట్టు ఏడీఏ కంకిపాటి సావిత్రి తెలిపారు. అడ్డతీగల మండలం తిమ్మాపురం ఆర్బీకేకు–20.25 టన్నుల యూరియా, ఎల్లవరానికి–10.12 టన్నులు, వెంకటనగరానికి–10.12 టన్నులు, దుశ్చర్తికు–20.25 టన్నులు, తుంగమడుగులకు–20.5 టన్నులు, వై.రామవరానికి–20.25 టన్నులు, జడ్డంగికు– 20.25 టన్నులు, కొమరాపురానికి–20.25 టన్నుల యూరియా చేరిందని పేర్కొన్నారు. త్వరలో డీఏపీ కూడా వస్తుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఈ ఎరువులను రైతులు ఆర్బీకేల్లో కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ప్రతి రైతు ఏఏ పంటలు సాగుచేస్తున్న వివరాలను ఈ–క్రాపులో నమోదు చేసుకోవాలని సూచించారు.జిల్లాలో మూడింట ఒక వంతు మాత్రమే వరినాట్లు పడినట్టు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 59,000 హెక్టర్లలో వరి సాగు చేస్తుండగా ఇప్పటివరకు 13,000 హెక్టార్లలో మాత్రమే నాట్లు వేసినట్టు పేర్కొన్నారు.



దమ్ము పనులు చేస్తున్న రైతులు

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్

జిల్లాలోని 196 ఆర్బీకేలు, సొసైటీలకు సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని ఎరువులు సిద్ధంగా ఉన్నట్టు మార్క్‌ఫెడ్ డీఎం. కె.రమేష్ తెలిపారు. రైతుల అవసరాల మేరకు ఇప్పటికే 295 టన్నుల యూరియా (బస్తా ధర రూ. 266) 182 టన్నుల డీఏపీ (ధర రూ.1350) 20–20–0–13 కాంప్లెక్స్ ఎరువు 90 టన్నులు (ధర రూ. 1198) జిల్లాలోని ఆయా ఆర్బీకేలు, సొసైటీలకు సరఫరా చేసినట్టు తెలిపారు. బఫర్ గోడౌన్స్‌లో ఇంకా 426 టన్నుల యూరియా, 50 టన్నుల డీఏపీ సిద్ధంగా ఉందన్నారు. ఎరువులు అవసరమైన రైతులు ఆర్బీకేలకు వెళ్లి కియోస్క్ లేదా సీఎం ఎయిడ్ యాప్ ద్వారా డీఎం మార్క్‌ఫెడ్ ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



నువ్వుగంటిపాలెంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



సీలేరులో వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు

వై.రామవరం: మండల లోతట్టు ప్రాంతంలోని వివిధ గ్రామాల్లో శని, ఆదివారాల్లో అడ్డతీగల లయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరాల్లో సుమారు 450 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ప్రభుత్వ ఆయుష్ శాఖ సహకారంతో, ఆ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకట కృష్ణ నేతృత్వంలో వైద్యాధికారులు ఆరు బృందాలుగా విడిపోయి ఈ వైద్య శిబిరాలు నిర్వహించినట్టు లయ స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటరు బుల్లయ్య తెలిపారు. మండలంలోని లోతట్టు ప్రాంతంలోని నువ్వుగంటిపాలెం, బుల్లోజిపాలెం, యర్రంరెడ్డిపాలెం, మునసలపాలెం, బొడ్డపల్లి, కె.యర్రగొండ, రేగడి పాలెం, చందుర్తి, పెద్దఊలెంపాడు, దాలిపాడు. గుమ్మరిపాలెం, పులుసు మామిడి గ్రామాల్లో జ్వరా లు ఎక్కువగా ఉండడంతో వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. మిగతా లోతట్టు గ్రామాల్లో కూడా అయుష్ శాఖ సహకారంతో వెద్య శిబిరాలను నిర్వ హిస్తామన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బుల్లయ్య కోరారు. శిబిరాల్లో ప్రభుత్వ అయుర్వేద వైద్యులు డాక్టర్ రాజరాజేశ్వరి, నీలిమ, మాళీ నాయక్, నాగేంద్ర, డి.పద్మజ, జె.పద్మజ్వాల, లయ సంస్థ ఆయుర్వేద వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరులో వైద్య శిబిరం

సీలేరు : సీలేరులో గల స్థానిక రామాలయం సెంటర్ వద్ద అపోలో హాస్పిటల్స్ డాక్టర్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 315 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

ఈ శిబిరంలో సీలేరు పరిసర గ్రామాల నుంచి రోగులు వచ్చి వైద్య పరీక్షలు చేసుకున్నారు. డాక్టర్ రాజేష్ వెంకట్ (న్యూరో ఫిజీషియన్), డాక్టర్ రవి వర్మ (రేడియోలజీ), డాక్టర్ గణేష్ (వాస్క్యులర్ సర్జన్), డాక్టర్ హేమంత్ నాగ వర్మ (ఆంకాలజిస్ట్ సర్జన్), డాక్టర్ వి.శ్రీనివాస్(గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్), డాక్టర్ రాజ్ (ఆర్థో పెడిక్స్), డాక్టర్ రవి(ఎమర్జెన్సీ మెడిసన్), డాక్టర్ అనిల్ మరియు డాక్టర్ నాగేంద్ర (ఫిజియోథెరఫీ), మరియు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు ఎస్.కె. ఖాదర్ ముస్తాన్ వలీ, కె.సౌమ్య మరియు హెల్త్ సూపర్‌వైజర్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సిరుల తల్లి నూకాంబిక

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం వేకువ జాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆదివారం అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో, ఈ రోజు పూజిస్తే కోరిన వరాలిస్తుందన్న నమ్మకంతో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కొంత మంది భక్తులు ఆలయ ఆవరణలోని చలువ పందిళ్ల నీడలో వంటలు చేసి, అమ్మవారికి నివేదించి, కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు తమ పిల్లలకు పాలిచ్చేందుకు అనువుగా ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ ఈవో బండారు ప్రసాద్ కల్పించారు. పట్టణ సీఐ దాడి మోహనరావు, ట్రాఫిక్ సీఐ టి.శ్రీను ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

రక్త దానంతో ప్రాణదానం

అనకాపల్లిటౌన్: ఆరోగ్యవంతుడైన వ్యక్తి రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరో ముగ్గురికి ప్రాణ దానం చేసినట్టేనని మిత్రా అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్ ప్రతినిధి గుండా రమేష్‌గుప్తా అన్నారు. స్థానిక సిటీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జీవీఎంసీ పెద్ద హైస్కూల్ 1988 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ప్రతీ ఏడాది స్నేహితుల దినోత్సవం రోజున కలుసుకుని, రక్తదానంతో పాటు వివిధ సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతులైన వ్యక్తులు ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. విశాఖ ఏఎస్ రాజా వలంటరీ బ్లడ్ బ్యాంక్‌కు 60 మంది పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు.



రక్తదానం చేస్తున్న జీవీఎంసీ పెద్ద హైస్కూల్ 1988 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

మోదమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో మోదమాంబ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులతో పాటు దూర ప్రాంతాలకు చెందిన వారు అమ్మవారిని దర్శించుకున్నారు. కె.జె.పురం చెరకు కాటా ఆవరణలో నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. అదే రోజు రాత్రి ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల సాధనకు పాదయాత్ర

అనకాపల్లిటౌన్: జిల్లా నాన్ షెడ్యూల్డ్ ఆదివాసీల పాదయాత్రను ఆగస్టు 4 నుంచి 7 వరకు నిర్వహించనున్నట్టు అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం కార్యదర్శి పీఎస్ అజయ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నూతన జిల్లాలు ఏర్పడ్డాక జిల్లాలో మిగిలిపోయిన ఆదివాసీలు ఐటీడీఏ రక్షణ పరిధి బయట ఉండిపోయారని పేర్కొన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు పాడేరు ఐటీడీఏ ఆదివాసీలందరికీ రక్షణ కవచంగా ఉండేదని, ప్రస్తుతం అది అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలిసిపోయిందన్నారు. అనకాపల్లిలో షెడ్యూల్డ్, నాన్ షెడ్యూల్డ్ ఆదివాసీల భూములకు రికార్డులు మార్చేసి గిరిజనేతరులు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతాలుగా గుర్తించాలని దివంగత సీఎం వైఎస్సార్ నియమించిన కోనేరు రంగారావు కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరారు.

వ్యాపారి మృతికి సంతాపం



గంపరాయి లక్ష్మి(ఫైల్)

సాక్షి,పాడేరు: పాడేరు పట్టణంలో గత 50 ఏళ్ల నుంచి హోటల్ నడుపుతున్న గంపరాయి లక్ష్మి(80)అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆమె మృతికి సంతాపంగా వర్తకులు దుకాణాలు మూసివేశారు. ఆమె మృతికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు విచారం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నేత కొట్టగుళ్లి చిన్ని తదితరులు లక్ష్మీ మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ ఎస్.వి.రమణమూర్తి, ఉప సర్పంచ్ బూరెడ్డి రాంనాయుడు, వర్తక సంఘం నేతలు పేరురి రామకృష్ణ, సత్యనారాయణరాజు, బూరెడ్డి కొండబాబు, పద్మశాలి సేవా సంఘం ప్రతినిధులు తదితరులు సంతాపం తెలిపారు. పాడేరులో అంత్యక్రియలు జరిపారు.

ఘనంగా స్నేహ మాసోత్సవాలు

అనకాపల్లిటౌన్: అంతర్జాతీయ స్నేహ మాసోత్సవ వేడుకలు ఆగస్టు 6 వరకూ నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె. జోగినాయుడు చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పిండి వంటల పోటీలు, ప్రదర్శనను నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా డాక్టర్ అలేఖ్య, లక్ష్మీనారాయణరావు దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడుతూ ఏటా క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ఆగస్టు 6న అందించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులతో నాణ్యమైన ఎరువులు



ప్రకృతి వనరులతో సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : ప్రకృతి వనరులతో సేంద్రియ ఎరువులు తయారు చేసుకుని లాభసాటి వ్యవసాయాలు చేసుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి శ్యామల అన్నారు. వేమగిరి గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అనువుగా ఎన్‌పీఎం షాప్ ప్రారంభించారు. ఈ దుకాణంలో అవసరమయిన మీనామృతం, దశ ప్రతిక వంటి ఎరువులు సిద్ధంగా ఉంచడం జరుగుతోందన్నారు.నిత్యం ఈ దుకాణం పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తూ అవసరమైన ఎరువులు అందిస్తామన్నారు. గుడివాడ గ్రామంలో కూడా ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీపీఎం లచ్చన్న, ఐసీఆర్‌పీ కనకారావు, రాయుడు, వరలక్ష్మి పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం వద్దు

మాకవరపాలెం: రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి సేద్య పద్ధతుల్లో తయారు చేసిన ఎరువులపై రైతులు దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుదర్శన్, వరలక్ష్మి కోరారు. ఆదివారం మల్లవరం శివారు ఎం.నగరంలో ప్రకృతి సేద్య పద్ధతుల్లో తయారు చేసిన ఎరువుల దుకాణాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ దుకాణంలో బీజామృతం, ఘన, ద్రవ, జీవామృతాలతోపాటు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం వంటి కషాయాలు అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు. రైతులు వీటిని కొనుగోలు చేసుకుని ఆరోగ్యవంతమైన పంటను పొందాలని సూచించారు.

అభివృద్ధి పనులకు ప్రత్యేక చర్యలు



మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఆదివారం పర్యటించారు. స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ అరకు నియోజక వర్గంలో ఆరు మండలాల్లో ప్రతి మండలానికి రూ.1.20కోట్ల చొప్పున అభివృద్ధి పనులు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేసి, పార్టీ మరింత బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేసి, అందరికీ అందేలా చూడాలన్నారు. పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అందరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, ఎంపీటీసీ సభ్యులు విజయ, రామారావు, సర్పంచ్‌లు సుబ్బారావు, నాగేశ్వరరావు, వెంకటరావు, లచ్చు, అర్జున్, వైస్ సర్పంచ్‌లు మహదేవ్, జగ్గునాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సొంద్రు, నాయకులు సింహాచలం, శ్రీరాములు, కృష్ణారావు, పరుశురాం, నాగేశ్వరరావు, చిరంజీవి, మహాదేవ్, నరేష్, శాంతి, సద్దు, బలరాం, లీలారాణి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మద్దు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం



చిలకలగెడ్డ ఆశ్రమ పాఠశాలలో బోరు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలో ఎంపీ నిధులతో మంజూరైనా బోరు పనులను ఆదివారం ఎంపీపీ శెట్టి నీలవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది పాఠశాలలో సందర్శించినప్పుడు తాగునీటి సమస్యపై విద్యార్థులు వివరించగా, ఈ సమస్యను ఎంపీ గొడ్డేటి మాధవి దృష్టికి తీసుకువెళ్లానని, ఎంపీ నిధులతో మండలానికి ఆరు బోర్లను మంజూరుచేసినట్లుగా తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కారానికి కృషి చేయడంపై విద్యార్థిని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కో ఆప్షన్ సభ్యుడు మదీనా తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త పనులతో అవస్థలు



రూడకోట వద్ద తారురోడ్డు పరిస్థితి



చిత్తడి దారిలోని గోతులో కూరుకుపోయిన లారీ



మొండిజామిగుడ గ్రామ రహదారి

ముంచంగిపుట్టు: మండలంలోని జర్జుల పంచాయతీ కడింగిబీరు, బురదగుంట గ్రామాల రహదారులు అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సిందిపుట్టు గ్రామం నుంచి బురదగుంట రహదారి పనులను కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేయడంతో రాళ్లు తేలిన రోడ్డు వల్ల ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు చెబుతున్నారు. బూసిపుట్టు తారురోడ్డు నిర్మించిన నెల రోజుల్లోనే అధ్వానంగా మారిందని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొందని, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ నాణ్యత లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేశారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో రహదారుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి నుంచి ఏలేశ్వరం వరకు గల ప్రధానర హదారి పూర్తి అధ్వానంగా మారిందని వాహనచోదకులు చెబుతున్నారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు చిత్తడిగా మారిన ఈ మార్గంలో క్వారీ లారీ బురదలో కూరుకుపోయింది. దీంతో గంటపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి రహదారికి మరమ్మతు చేసి, రోడ్డును అందుబాటులో తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

అనంతగిరి:మండల కేంద్రం సమీపంలోగల మొండిజామిగుడ గ్రామానికి వెళ్లే గ్రావెల్ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. ఐదేళ్ల క్రితం పంచాయతీరాజ్‌శాఖ నిధులతో జామిగుడ గ్రామానికి గ్రావేల్‌రోడ్డును నిర్మించారు. అయితే వర్షాల కారణంగా గ్రామ సమీపంలోని పూర్తిగా కోతకు గురైంది. వర్షాల కారణంగా కోతకు గురికావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సమాజ సేవకులకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ శివదొర, సిటిజన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ చిన్నబాబు

గంగవరం : సూరంపాలెం పంచాయతీ సర్పంచ్ బల్లెం శివ దొర, రాజవరం గ్రామానికి చెందిన సిటిజన్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ నిడమర్తి చిన్నబాబులకు నేషనల్ సోషల్ సర్వీస్ అవార్డు , మదర్ థెరిసా జాతీయ అవార్డులు దక్కాయి. హైదరాబాద్ హెచ్ఎస్‌సీ యూనివర్సిటీ డివేన్ మినిస్ట్రీ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయా అవార్డులను వారు అందుకున్నారు. యూనివర్సిటీ అధినేత బిషప్ ఆనంద్, ఆల్ ఇండియా క్రిస్టియన్ సింగర్ సురేష్ డేవిడ్ చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నారు. వారు చేస్తున్న సమాజ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా అవార్డులు దక్కాయి. బిషప్ వరప్రసాద్, డాక్టర్ ఆలపాటి లక్ష్మీనారాయణ, విజయ శ్రీ విద్య సంస్థల అధినేత డాక్టర్ బావిశెట్టి రామచక్రపాణి, ఫిల్మ్ డైరెక్టర్, నిర్మాత డాక్టర్ యాండ్రా సునీల్ కుమార్, గుణశేఖర్, రవి, షేక్ నజీబ్ తదితరులు పాల్గొనట్టు అవార్డు గ్రహీతలు తెలిపారు.

పోడు పట్టాలు అందజేయాలి

చింతపల్లిరూరల్: మండలంలోని పెదబరడ గ్రామస్తులు పోడు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు జల్లి కృష్ణ, బొబ్బిలి రమణ తదితరులు మాట్లాడుతూ గ్రామంలో 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు అందజేయాలని కోరారు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోని పట్టాలు అందేలా చూడాలని వారు కోరారు.

నేడు వాహనాల వేలం

పాయకరావుపేట : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో గల వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 31వ తేదీన వేలం వేయడం జరుగుతుందని ఎస్ఈబీ ఎస్ఐ ఎం.రామేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు పట్టణంలో గల ఎస్ఈబీ కార్యాలయానికి వచ్చి వాహనాల వేలంలో పాల్గొనవచ్చునని ఆ ప్రకటనలో తెలిపారు.